ఎంపీఈవోల డిప్యూటేషన్లు రద్దు

బోథ్, జూలై 26 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో పని చేస్తున్న మండల పంచాయతీ అధికారుల డిప్యూటేషన్లు రద్దయ్యాయి. అన్ని శాఖల్లో డిప్యూటేషన్లు రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఎంపీఈవోలు ఇది వరకు పని చేస్తున్న స్థానాలకు వెళ్లారు. జనవరి 31వ తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ 17 మంది ఎంపీఈవోలను డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం సాధారణ బదిలీల ప్రక్రియ మొదలు కావడంతో డిప్యూటేషన్ రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 17 మంది ఎంపీఈవోలకు గాను ఏడుగురు బదిలీ ప్రక్రియలో భాగంగా ఇతర మండలాలకు వెళ్లారు. మిగిలిన వారు యథావిధిగా ఇది వరకు పని చేస్తున్న మండలాల్లో తిరిగి విధుల్లో చేరారు. బోథ్ ఎంపీవో ధర్మజీవన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాలలో బోనాల జాతర

బోనాల జాతరలో వేదం పాఠశాల విద్యార్థులు

బోథ్, జూలై 26 : బోథ్‌లోని వేదం పాఠశాలలో శుక్రవారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు ఎత్తి అమ్మవారికి పూజల చేశారు. పోతరాజు, పులుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంతోష్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఇచ్చోడ(సిరికొండ), జూలై 26 : సిరికొండలో ఐటీడీఏ ఉట్నూర్, ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డెంగీ, మలేరియా వ్యాధులపై శుక్రవారం కళాకారులు తమ ఆటాపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ శ్రీధర్, కార్యదర్శి ఆనంద్, ప్రవీణ్, కళాకారులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

కల్లెం దయాకర్(ఫైల్)

ఇచ్చోడ, జూలై 26 : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కల్లెం దయాకర్(50) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇంద్రవెల్లి, జూలై 26: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయాన్ని ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడి తహసీల్దార్‌తో కలిసి సందర్శించారు. ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు చేసిన వారిని గుర్తించి పూర్తి వివరాలతో కూడిన నివేదికలు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్, ఇంద్రవెల్లి జీపీ బిల్ కలెక్టర్ గంగారాం, ఏఎంసీ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఇంద్రవెల్లి, జూలై 26: లింగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈవో రవీందర్ తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు శ్రావణ్‌రాథోడ్, శ్రీనివాస స్వామి, సీనియర్ అసిస్టెంట్ మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

ఎదులాపురం, జూలై 26 : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీశ్, మడావి గణేశ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలతో పాటు జిల్లాలో అనుమతి లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు.

విద్యారంగానికి నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

ఎదులాపురం, జూలై 26 : రాష్ట్ర విద్యారంగ అభివృద్ధి కోసం కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేడు కేవలం 7.3% నిధులు కేటాయించడం పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడంలో భాగమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అజ్మీర ఆరోపించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని కుమ్రం భీం భవన్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల అమలు గురించి ఈ బడ్జెట్లో ప్రస్తావనే చేయకపోవడం దుర్మార్గం అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు బల్వీర్ సింగ్, రాజేశ్, రాము, విజయ్ పాల్గొన్నారు.

గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

నిర్మల్ అర్బన్, జూలై 26: నిర్మల్ జిల్లాలోని బీసీ గురుకులాలకు ఐదు ఎకరాల స్థలంలో ఒక్కొక్క పాఠశాలకు రూ.25 కోట్ల నిధులతో శాశ్వత భవనాలు ప్రభుత్వం నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బీసీ గురుకులాలకు, బీసీ హాస్టళ్లకు శాశ్వత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అద్దె గదుల్లో అరకొర వసతుల మధ్య విద్యను కొనసాగిస్తున్నారని అన్నారు. భవనాల నిర్మాణాలకు ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, బొజ్జు పటేల్, ఎమెల్సీ దండె విఠల్ చొరవ చూపాలన్నారు. లేని పక్షంలో సెప్టెంబర్ 3వ తేదీన 3వేల మంది విద్యార్థులతో ధర్నా చేస్తామని తెలిపారు.

తిరుపతిలో భైంసా విద్యార్థుల నృత్య ప్రదర్శన

భైంసా, జూలై 26 : భైంసాకు చెందిన శ్రీ కళానిలయం డ్యాన్స్ అకాడమీ యోగేశ్ డ్యాన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన ప్రదర్శనలో భైంసా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనను అందించారు. కేంద్ర ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర ఆలయ సన్నిధిలో విద్యార్థుల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు.

కేస్లాపూర్ గ్రామ పంచాయతీ తనిఖీ

ఇంద్రవెల్లి, జూలై 26: కేస్లాపూర్ గ్రామ పంచాయతీని శుక్రవారం ఎంపీడీవో భాస్కర్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం నర్సరీలోని మొక్కలు గ్రామంలోని గిరిజన ఆశ్రమోన్నత బాలికల పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారంలో పాల్గొని ఈజీఎస్ అధికారులతో పాటు కూలీలతో కలిసి మొక్కలు నాటారు.. ఆయన వెంట కేస్లాపూర్ ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, కార్యదర్శి మహ్మద్ మోతేశం, టీఏ జాదవ్ విఠల్, అంగన్‌వాడీ కార్యకర్త కమలబాయి ఉన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి
- కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



ఎదులాపురం: కార్గిల్ పార్కు వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ అర్బన్, జూలై 26: దేశంకోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు మరువలేనివని డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని కస్బా ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కెడెట్ల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అమరవీరులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ, ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఎన్‌సీసీ అధికారి సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎదులాపురం, జూలై 26 : ఆదిలాబాద్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. స్థానిక కార్గిల్ పార్కులోని స్తూపం వద్ద వివిధ పార్టీలు, సంఘాల నేతలు అమర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, నేతలు సాజిదోద్దీన్, ప్రకాశ్, పవన్ నాయక్, శ్రీను, దినేశ్ మాటోలియా, రాజేశ్, వేద వ్యాస్, ఆకుల ప్రవీణ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కార్యదర్శి మాధవ్, బండారి దేవన్న పాల్గొన్నారు.

బేల, జూలై 26 : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జవాన్ సాయి కోటవార్, బజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు ఆకాశ్ అగార్కర్, వైస్ ప్రెసిడెంట్ ప్రీతమ్ ముజేందర్, సామాజిక కార్యకర్త రాము భార్కడే, విశ్వహిందూ పరిషత్ మండల జనరల్ సెక్రటరీ ప్రవీణ్, కార్తీక్, వంశీ, శ్యాం, రోహిత్ పాల్గొన్నారు.

సోనాలలో

బోథ్, జూలై 26 : సోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బోథ్‌లోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ ఒక నిమిషం మౌనం పాటించారు. కార్యక్రమంలో హెచ్ఎం కిశోర్‌కుమార్, ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీవాడ పాఠశాలలో...

ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మి వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనియన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పిల్లి కిషన్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్‌లోని మున్సిపల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు నివాళులర్పించారు. కళాశాలలో డాక్యుమెంటరీని ప్రదర్శించారు అదేవిధంగా విద్యార్థులకు వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జే అనిత, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావు, ఎన్‌సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ పీవోలు స్వప్న, యాకూబ్ అలీ, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసా, జూలై 26: భైంసాలో బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. వీర జవాన్లకు సెల్యూట్ చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ నాయకులు నారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్, రవి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా టౌన్, జూలై 26 : మహాగాం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవీదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల, జూలై 26: కుంటాలలోని శాంతినికేతన్ విద్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపిల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లేయర్ పాఠశాలలో..

దిలావర్‌పూర్, జూలై 26 : సిర్గాపూర్‌లో గల ప్లేయర్ ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకొని నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, జూలై 26 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ తీశారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, సమన్వయకర్త నర్సయ్య, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌అర్బన్ : మొక్కలు నాటుతున్న డీఈవో, ఉపాధ్యాయులు

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాలి

తానూర్, జూలై 26 : పల్లెప్రకృతి వనంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ప్లానిటేషన్ మేనేజర్ ఓజాప్రసాద్ అన్నారు. శుక్రవారం బోరగాం గ్రామంలో పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ నంద్, టీఏ రమణాగౌడ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఇచ్చోడ: మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఇచ్చోడ, జూలై 26 : మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డేను పురస్కరించుకొని జిల్లా ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పుల్లయ్య, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో ఉదయ్‌రావ్, వైద్యులు కిరణ్, శ్రీధర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ), జూలై 26: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ అధికారులు నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, అధికారులు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఐటీడీఏ ఏపీవో మృతి

దస్తురాబాద్,జూలై 26 : భద్రచాలం ఐటీడీఏ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న మండలంలోని మల్లాపూర్ గొండు గూడెం గ్రామానికి చెందిన పెందోర్ భీంరావ్(50) గురువారం హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...కొద్ది రోజులు అనారోగ్యానికి గురి కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని దవాఖానకు తీసుకెళ్లారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పెందోర్ భీంరావ్ ఊట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ఏవో, ఏపీవో, డీడీగా పని చేసి ఆదివాసీలకు సేవలందించారు. భార్య,ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు.

భీంరావ్ సేవలు మరువ లేనివి

దస్తురాబాద్,జూలై 26 : ఆదివాసీల ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన పెందూర్ భీంరావ్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. మల్లాపూర్ గొండు గూడెం గ్రామానికి చెందిన భద్రాచలం ఐటీడీఏ ఏపీవో పెందూర్ భీంరావ్ గురువారం హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కాగా శుక్రవారం స్వగ్రామం మల్లాపూర్ గొండు గూడెంలోని నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

నిర్మల్ అర్బన్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరింగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిగంబర్, నవీన్ , యూఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ నలంద్ అన్నారు. శుక్రవారం విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన నిధులతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించలేమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి మండలానికి తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని చెప్పి దీనిపై బడ్జెట్‌లో ఊసే లేదని అన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగ అభివృద్ధికి నిధులు పెంచాలన్నారు.

ఖానాపూర్ వైద్యాధికారిగా వేణుగోపాలకృష్ణ

ఖానాపూర్ టౌన్, జూలై 26: ఖానాపూర్ ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారిగా డాక్టర్ వేణుగోపాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ ఆర్ఎంవోగా వైద్య సేవలందించిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా ఖానాపూర్‌కు వచ్చారు. రోగులకు అంకితభావంతో మెరుగైన సేవలందిస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

దిలావర్‌పూర్, జూలై 26 : దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద నాలుగు రోజులు క్రితం బైక్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామానికి చెందిన ఒల్లెపు ఎర్రన్న, శోభ దంపతుల కుమారుడు ఒల్లెపు రాజు (22) హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ భీంరావ్ తెలిపారు. రాజు తన బైక్‌పైన బంధువులైన నర్సాపూర్(జీ) మండలం రాంపూర్ గ్రామానికి వెళ్లి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద నిర్మల్ వైపు నుంచి బైంసా వైపునకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్య చేసుకబోయే వ్యక్తిని కాపాడిన పోలీసులు

బాధితుడు సయ్యద్ ముజీబ్‌తో పోలీసులు

భైంసా, జూలై 26: నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన సయ్యద్ ముజీబ్ తన భార్య సొంత ఊరు అయిన భైంసాకు వచ్చి జీవితంపై విరక్తి చెందడంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి చనిపోవడానికి వెళ్తున్నానని 100కు ఫోన్ చేశాడు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ చందు వెంటనే వెళ్లే సయ్యద్ ముజీబ్‌ను కాపాడాడు. సయ్యద్ ముజీబ్‌ను కాపాడిన కానిస్టేబుల్ చందును పట్టణ సీఐ రాజారెడ్డి అభినందించారు.

భైంసాలో డెంగీ కలకలం

భైంసా, జూలై 26: భైంసాలోని ఏపీ నగర్ కాలనీలో ఒకరికి డెంగీ, మరో కాలనీలో డెంగీ సోకడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం కాలనీలలో గల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వారి వెంట అంగన్‌వాడీ కార్యకర్తలు, సీహెచ్‌వో డాక్టర్ గిరిబాబు, ఎస్‌హెచ్‌వో డాక్టర్ కన్నయ్య, డాక్టర్ ఇంతియాజ్, డాక్టర్ మతీన్, హెల్త్ సూపర్‌వైజర్లు అజయ్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఎంపీవోగా రమేశ్‌రెడ్డి

దస్తురాబాద్, జూలై 26 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ఎంపీవోగా రమేశ్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా రమేశ్ రెడ్డి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల ఎంపీవో విధులు నిర్వహించారు. బదిలీపై ఇక్కడి వచ్చారు. మేశ్ రెడ్డిని ఎంపీడీవో రమేశ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధిస్తాం

లక్ష్మణచాంద, జూలై 26: రెండ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావు పేర్కొన్నారు. శుక్రవారం వడ్యాల్, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి తదితర పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు అరవింద్ కుమార్, లక్ష్మణచాంద ఉపాధ్యాయ సంఘం నాయకులు చింత మోహన్, పరమేశ్వర్, సాయిప్రసాద్, కిష్టయ్య పాల్గొన్నారు.

పేదల బడ్జెట్

మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్

ఉట్నూర్, జూలై 26: సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పేదల బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమాకు కేటాయించిన నిధులు రైతుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్పీరెడ్డి, లింగంపల్లి చంద్రయ్య, ఖయ్యూం, ఎక్బాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

భైంసా టౌన్, జూలై 26 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామాన్ని శుక్రవారం డీఎల్‌పీవో సుదర్శన్ సందర్శించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టాకా గ్రామంలో పర్యటించిన సందర్భంగా డీఎల్‌పీవోను గ్రామస్తులు, జీపీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో మోజం హుస్సేన్, కార్యదర్శి గాయత్రి, నాయకులు గణేశ్‌పాటిల్, రామ్‌కుమార్, నారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనం పరిశీలన

ముథోల్, జూలై 26: ముథోల్ నూతనంగా డిగ్రీ కళాశాల ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో తరగతులు ప్రారంభంకానున్నాయి. ఈ విద్యాసంవత్సరం తాత్కాలికంగా నూతన డిగ్రీ కళాశాల కోసం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన పాత భవనాన్ని శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్ , డీటీడబ్ల్యూవో అంబాజీ పరిశీలించారు. భవనంలో ఉన్న వసతులను పరిశీలించి పలు వివరాలను ప్రిన్సిపాల్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. భవన పరిశీలన నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు.

కుభీర్ ఎంపీడీవోగా మోహన్‌సింగ్

కుభీర్, జూలై 26: కుభీర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన మోహన్‌సింగ్ శుక్రవారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ సూపరింటెండెంట్ నవనీత్ కుమార్, ఎస్ఏ రహమాన్, పీఆర్ ఏఈ తోఫిక్, సిబ్బంది ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. గతంలో ఆయన ఎస్ఏగా పనిచేసి ఉద్యోగోన్నతిపై తానూర్ ఎంపీఓగా పని చేసి ఇక్కడికి వచ్చారు. పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు ఆయనను కలిసి అభినందించారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ అర్బన్, జూలై 26 : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని ప్రియదర్శిని నగర్ కాలనీలో డెంగీ సోకిన వ్యక్తుల ఇంటి పరిసరాల్లో టేమోఫాస్ ద్రావణంతో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో జవా